క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యపూజలతో పాటు అభిషేకాలు, హారతులు పట్టారు. పలువురు భక్తులు పండ్లు, చీర, పిండి వంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న వెంకట్రావు

బొమ్మలసత్రం: రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు తెలిపారు. స్థానిక ఆల్‌మదద్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై చేసిన పోరాటలను వివరించారు.సమావేశం అనంతరం నంద్యాల నియోజకవర్గ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కాకర్ల శివ, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్, కోశాధికారిగా జాషువ, ఉపాధ్యక్షులుగా గిరిబాబు సాగర్, మస్తాన్, సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శులు అబ్దుల్, ఇక్బాల్, పవన్, రాజును ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్ల, మౌలాలి, జిల్లా కన్వీనర్ మద్దయ్య పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం



ప్రచారంలో పాల్గొన్న అవంతికారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోదరి గంగుల అవంతికారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోఎస్వీనగర్ ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గంగుల బిజేంద్రారెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కౌన్సిలర్ డాక్టర్ సుధామణి, రమేష్, న్యాయవాది సరిత, డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి, నజీర్ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరీథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు నిర్వహించారు. శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ ప్రభు భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. మానవ సంబంధాలు, ఉన్నత జీవనం సాగించేందుకు ఉపయోగ పడే అన్ని అంశాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు. గీత పఠనం, శ్రవణంతో జీవన యానంలో మార్పు వస్తుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి అభిషేకార్చనలు



మహానందీశ్వరుడి దంపతులకు పూజలు చేస్తున్న పండితులు, అర్చకులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్ల మూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం పూజలు వైభవంగా చేపట్టారు. సెలవురోజు కావడంతో పలు ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారితో పాటు కోదండరాముడు, వినాయకనందీశ్వరస్వామి, గరుడ నందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు.

కళ్ల ముందే కలలదారులు

- రూ.3.75 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు

దొర్నిపాడు: రహదారులు నాగరికతకు చిహ్నం అంటారు. ఏళ్లగా రహదారులు సరిగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నా గత పాలకులు పట్టించుకోలేదు.. ఫలితం.. ప్రజలకు కష్టాలు కొనసాగాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక వారి అవస్థలను తీర్చేందుకు కోట్లాది రూపాయలను కేటాయించి రోడ్లను పూర్తి చేయించింది. దీంతో వారికి ప్రయాణ కష్టాలు తప్పడంతో పాటు వారి కలలు నెరవేరాయి.

రోడ్ల నిర్మాణాలు..

- చాకరాజువేముల నుంచి డబ్ల్యూ గోవిందిన్నె వరకు రూ.2 కోట్లతో నాలుగు కిలోమీటర్లు, కంపమల్ల మెట్ట నుంచి డబ్ల్యూ గోవిందిన్నె వరకు రూ.1.75 కోట్లతో 5 కిలోమీటర్లు ఆర్‌అండ్‌బీ రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి.
- రూ.1.75 కోట్లతో కంపమల్ల మెట్ట నుంచి డబ్ల్యూ గోవిందిన్నె కంపమల్ల మెట్ట నుంచి డబ్ల్యూ గోవిందిన్నె వరకు 6.6 కిలోమీటర్ల దూరం ఉంది. డబ్ల్యూ గోవిందిన్నె గ్రామస్తులు కంపమల్ల మెట్ట చేరుకుంటే కోవెలకుంట్ల–ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో కలుస్తారు. అలాగే గ్రామస్తులకు ఈ దారిలో అత్యధికంగా పొలాలు ఉండటంతో వీరికి ఉపయోగంగా మారుతుంది. అలాగే కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు, కంపమల్ల గ్రామస్తుల పొలాలు కూడా ఈ దారిలోనే ఉన్నాయి. అలాగే పెద్దమ్మను దర్శించుకోవడానికి వచ్చే భక్తుల రాకపోకలకు ఈ రోడ్డు ఎంతో సౌకర్యంగా ఉండనుంది.
- రూ.2కోట్లతో చాకరాజువేముల – డబ్ల్యూ గోవిందిన్నె రోడ్డు.. ఈ రహదారి నిర్మించడం వల్ల డబ్ల్యూ గోవిందిన్నె గ్రామస్తులు దొర్నిపాడుకు చేరకుకోవడానికి కేవలం 7 కిలోమీటర్ల దూరం అవుతుంది. గతంలో గ్రామస్తులు కంపమల్ల మెట్ట, డబ్ల్యూ కొత్తపల్లె నుంచి చాకరాజువేముల మీదుగా వచ్చేవారు. ప్రస్తుతం నిర్మాణ పనులు తుదిదశకు చేరడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆళ్లగడ్డ, చింతకుంట ప్రాంత వాసులు పెద్దమ్మను దర్శించుకోవడానికి ఈ దారి ఉపయోగకరంగా మారనుంది. రెండు గ్రామాల మధ్య పొలాలు అధికంగా ఉండటంతో పంటను ఇంటికి తెచ్చుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అడ్డంకులు సృష్టించినా.. ఆగని పనులు..

చాకరాజువేముల–డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల మధ్య నిర్మిస్తున్న రహదారి పనులకు ఉపయోగించే హిటాచీకి కొందరు దుండగులు నిప్పుపెట్టి రూ.20 లక్షలు నష్టం వచ్చేలా చేశారు. జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కాంట్రాక్టర్ శివరామిరెడ్డికి ధైర్యం చెప్పారు. దుండగులను వెంటనే పట్టుకొని శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. దీంతో పనులు కొనసాగుతున్నాయి.




పూర్తయిన కంపమల్లమెట్ట–డబ్ల్యూ గోవిందిన్నె రోడ్డు, నిర్మాణంలో చాకరాజువేముల–డబ్ల్యూ గోవిందిన్నె రోడ్డు

చిరకాల స్వప్నం తీరింది



డబ్ల్యూ గోవిందిన్నె నుంచి చాకరాజువేముల గ్రామానికి రహదారి ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వాలను కోరినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మంచి రోజులు వచ్చాయి. రోడ్డు పూర్తవడంతో రెండుగ్రామ ప్రజల రాకపోలకు సౌకర్యంగా ఉంటుంది. ఇక నుంచి కేవలం 15 నిమిషాల్లో మండల కేంద్రం చేరుకోవచ్చు. రోడ్డు ఏర్పాటుతో రెండు గ్రామాల ప్రజల స్వప్నం నెరవేరనుంది.

– జాకీర్‌బాషా, డబ్ల్యూ గోవిందిన్నె

రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయి



చాకరాజువేముల నుంచి డబ్ల్యూ గోవిందిన్నె రోడ్డు అధ్వానంగా ఉండేది. దీంతో ప్రయాణికులు, రైతులు, వాహనదారులు ఆ దారిలో వెళ్లాలంటే అగచాట్లు పడేవారు. సమస్యను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు పూర్తి కావస్తున్నాయి. ముఖ్యంగా చాకరాజువేముల గ్రామస్తుల పొలాలు ఈ దారిలో అధికంగా ఉన్నాయి. రోడ్డు పూర్తయితే వారి కష్టాలు తొలగనున్నాయి.

– భూమా చెంచిరెడ్డి, సొసైటీ చైర్మన్, చాకరాజువేముల

ఫొటోలు తొలగించాలి

నంద్యాల(న్యూటౌన్): పాఠశాలల సమీపంలో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలని డీఈఓ సుధాకర్ రెడ్డి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నంద్యాల జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాఠశాలలో అమలు అవుతున్న వివిధ పథకాలకు సంబంధించిన, రాజకీయ నాయకుల ఫొటోలను వెంటనే తీసేయాలని చెప్పారు. అలాగే పాఠశాలకు 100 మీటర్లలోపు ఫ్లెక్సీలు, ఫొటోలు ఉంటే పంచాయతీ సెక్రటరీకి తెలియజేసి తొలగించి ధ్రువీకరణ పత్రాలను సంబంధిత అధికారుల ద్వారా విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టం చేశారు.

విధుల్లో అలసత్వం వద్దు

మహానంది: ఎన్నికల వేళ విధుల్లో అసలత్వం వహించకుండా, ఎన్నికల నియమావళి అనుసరించి విధులు పకడ్బందీగా చేపట్టాలని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్, ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎక్కడా రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు లేకుండా చూడాలని, విగ్రహాలు ఉంటే వాటిని కవర్లతో కప్పేయాలన్నారు. ఎలాంటి గుర్తులు, చిత్రాలు ఉంచరాదన్నారు. అనంతరం వివిధ గ్రామాల్లో పర్యటించి రాజకీయ పార్టీల బ్యానర్లను తొలగించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



కేంద్ర బలగాలతో దొర్నిపాడులో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్‌ఐ

దొర్నిపాడు: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రూరల్ సీఐ హనుమంతునాయక్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందుస్తుగా గ్రామస్తులకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎవరి ఓటు వారు నిర్భయంగా వేసుకోవాలని తెలిపారు. అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. ఎస్‌ఐ సురేష్ ఉన్నారు.

సీఏఏను వ్యతిరేకించాలి



సదస్సులో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): సీఏఏను వ్యతిరేకించాలని కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రోజాకుంటలోని అబ్దుల్లా షాదీఖానాలో సదస్సు నిర్వహించారు. అవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిష్టీ, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతలయ్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి ఎం.శంకర్ పాల్గొన్నారు. వారు సీఏఏను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ రైతులను, ప్రజలను ఇబ్బందులు పెడుతోందని, గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. సీఏఏను వ్యతిరేకిస్తున్నట్లు ఉమ్మడిగా ప్రకటించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, సీపీఎం పట్టణ కార్యదర్శి నరసింహ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



శివరామయ్యకుంటకు నీటిని వదులుతున్న దృశ్యం

నీటి సమస్యకు పరిష్కారం

నంద్యాల(అర్బన్): నెల రోజులుగా నీటి ఎద్దడితో ఇబ్బందులు పడిన మిట్నాల వాసుల కష్టాలు తొలిగాయి. సర్పంచ్ ఇప్పల రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి ఆధ్వర్యంలో శివరామయ్య స్వామి కుంటను కేసీ కెనాల్ నీటితో నింపడమే కాకుండా మిట్నాల మీదుగా గుంతనాలకు వెళ్లే రహదారిలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన బోరు నీటిని పైప్‌లైన్లు ఏర్పాటు చేసి గ్రామంలో నాలుగు సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామస్తులకు కష్టాలు తొలిగాయి. దాదాపు 600 కుటుంబాలు ఉన్న గ్రామంలో శివరామయ్యకుంట, ఎస్సీ కాలనీ కుంటల ద్వారా గ్రామస్తులకు నీరు సరఫరా అవుతుంది. మిట్నాల మజరా గ్రామాలైన ఏ.శివరాంపురం, బి.శివరాంపురం కుంటలను ఇది వరకే కెనాల్ నీటితో నింపారు. అయితే మిట్నాల కుంటలు అడుగంటడంతో నీటి ఎద్దడి నెలకొంది. స్పందించిన నాయకులు, అధికారులు కుంటను నింపడమే కాకుండా రూ.4లక్షలతో పెట్రోల్ బంక్ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేసి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఎస్సీ కాలనీ కుంట అడుగంటడంతో కాలనీ వాసులు ట్యాంకుల నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. కావున కాలనీ కుంటను త్వరగా నీటితో నింపాలని స్థానికులు కోరుతున్నారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన ట్యాంకు



నీటిని పట్టుకుంటున్న స్థానికులు

ఆధ్యాత్మిక మాసం.. రంజాన్

- నియమబద్ధంగా ఉపవాస దీక్షలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

నంద్యాలవ్యవసాయం: ముస్లింలకు పవిత్రమైన నెల రంజాన్ మాసం. ప్రారంభం నుంచి ముగిసే వరకు పగలు నిష్టగా రోజా(ఉపవాస దీక్ష) పాటిస్తారు. కేవలం ఆహార పానియాలు మాని వేయడం మాత్రమే రోజా కాదని, నియమాలతో కూడుకున్న జీవన విధానాన్ని ఆచరిస్తారన్నారు. తెల్లవారుజామున ఆహారం తీసుకోవడాన్ని సహేరి, సాయంత్రం ఉపవాసదీక్ష విరమణలో తీసుకొనే ఆహారాన్ని ఇఫ్తార్ అంటారు. ప్రతిరోజూ సుమారుగా 13 గంటల పాటు కఠిన ఉపవాస దీక్ష అవలంభిస్తారు.

రోజూ 5 పూటల నమాజ్‌తో పాటు రాత్రి ఈషా నమాజ్ అనంతరం ప్రత్యేక తరావీ ప్రార్థనలు చేసి ముగిస్తారు. సాయంత్రం ఉవాపదీక్షలు విరమించే సమయంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుతో ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది. ఇఫ్తార్‌లో ముస్లింలు, పేద, ధనిక తేడా లేకుండా సామూహికంగా పాల్గొంటారు.

రంజాన్ ప్రత్యేక నియమాలు..

షబ్–ఏ–ఖదర్..

రంజాన్ మాసం ప్రారంభమైన 27వ రోజు షబ్–ఏ–ఖదర్‌ను నిర్వహిస్తారు. ఆ రోజు ఖురాన్ అవతరించిందని, ముస్లింల విశ్వాసం. ఆ రోజు రాత్రంతా జాగారణ చేసి నమాజ్‌తో గడుపుతారు. ఇలా చేసిన వారికి ఎన్నో ఏళ్ల నమాజ్‌లు చేస్తే దక్కే పుణ్యఫలితం దక్కుతుందని విశ్వాసం.

జకాత్..

ముస్లింలకు నమాజ్, రోజా ప్రకారమే జకాత్ కూడా నిర్ణయించబడింది. దైవాన్ని ప్రసన్నం చేసుకోడానికి, తాము సంపాదించిన ధనంలో కొంత మొత్తాన్ని పేదలకు అందించడమే జకాత్ ముఖ్య ఉద్దేశం. రంజాన్ నెలలోనే ముస్లింలు విధిగా జకాత్ చెల్లిస్తారు. పేద, ధనిక అంచనాలను రూపుమాపు చేయడానికి జకాత్ సహాయ పడుతుంది. జకాత్ అంటే పరిశుద్ధ పరిచేదని అర్థం.

ఫిత్రా (దానం)..

ఈ నెల అంతా రోజా, నమాజ్, జకాత్ చెల్లించడంతో పాటు నెల ముగిసి పండుగ జరుపుకొనే ముందు రోజు పేదలకు దానం చేయడాన్ని ఫిత్రా అంటారు. పేదలు కూడా పండుగ రోజు సంతోషంగా పాల్గొనడానికి చేసిందే ఈ ఏర్పాటు. కుటుంబ సభ్యులు ఎంత మంది ఉంటారో అందరి తరఫున విధిగా ఫిత్రా చెల్లిస్తారు. ఒక్కొక్క ఫిత్రా కింద రెండున్నర కిలోల ఆహార ధాన్యాలు, అందుకు సమానమైన నగదును అందజేస్తారు.

హలీమ్..

ఇఫ్తార్ సమయంలో సేవించే హలీమ్‌కు కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. మసాలా దినుసులు, డ్రైఫ్రూట్స్‌తో పాటు బొంబాయి రవ్వ, బియ్యం రవ్వ, మేక లేదా పొట్టేలు మాంసం తదితర పదార్థాలు కలిపి ఉడకబెట్టి జావా తయారు చేస్తారు. దీన్ని ప్రత్యేకంగా మట్టి పాత్రల్లో సేవిస్తారు.

షవ్వాల్..

నెలంతా పవిత్ర కార్యక్రమాలతో సాగిన ఉపవాస దీక్ష షవ్వాల్ నెలవంక ప్రత్యక్షం అవగానే ముస్లింలు విరమించి మరుసటి రోజు పండుగను భక్తి శ్రద్ధలతో సంతోషంగా నిర్వహిస్తారు. షవ్వాల్ నెల మొదటి రోజు జరుపుకొనే పండుగను ఈదుల్ ఫితర్ అంటారు.



జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆదివారం రాత్రి పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ రిటైర్డ్ కమిషనర్ సుందర్‌కుమార్, కుటుంబ సభ్యులు మహానందికి వచ్చారు. ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు వారికి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేపట్టారు. వారితో పాటు కర్నూలు అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎ.శ్రీనివాసకుమార్ దంపతులు పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతు శర్మ, శాంతారాంభట్‌లు వారికి వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.



వేదపండితుల ఆశీస్సులు అందుకుంటున్న రిటైర్డ్ కమిషనర్ సుందర్‌కుమార్

క్రీడాకారిణికి సత్కారం

శ్రీశైలంప్రాజెక్ట్: ఈ నెల10 నుంచి 14వ తేదీ వరకు పాట్నాలో జరిగిన 68వ బాలబాలికల క్రీడోత్సవాలలో ఆంధ్రప్రదేశ్ తరుఫున ప్రతిభ కనబరచిన సున్నిపెంటకు చెందిన వై.రాజ్యలక్ష్మిని మండల బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షుడు దగ్గుబాటి మల్లేశ్వరప్రసాద్ ఆదివారం అభినందించారు. జాతీయ 68వ జూనియర్ బాలబాలికల క్రీడలలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్ర రాష్ట్రానికి తన టీంతో కలసి రెండో స్థానాన్ని తీసుకువచ్చింది. బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అందించిన మెడల్, సర్టిఫికెట్‌తో సున్నిపెంటకు చేరుకున్న రాజ్యలక్ష్మిని ఆదివారం అసోసియేషన్ సత్కరించింది.

నేటి నుంచి పది పరీక్షలు

దొర్నిపాడు:పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 218 మంది రెగ్యులర్, 37 మంది కంపార్ట్‌మెంటల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చీఫ్ సూపరింటెండెంట్ రాజు తెలిపారు. పది గదులను ఏర్పాటు చేసి, బెంచీలు సిద్ధం చేశామన్నారు. దొర్నిపాడుతో పాటు భాగ్యనగరం జెడ్పీ హెచ్‌ఎస్, అమ్మిరెడ్డినగరం కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాస్తారు. అలాగే డబ్ల్యూ కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రస్తుతం గోస్పాడు మండలం యాళ్లూరు పరీక్ష కేంద్రంలో రాయనున్నారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా శాస్త్రిని నియమించారని చెప్పారు.

చాగలమర్రి: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని 8 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 6 ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులు 780 మంది పరీక్షలకు హాజరు కానున్నారని ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా ఆదివారం తెలిపారు. మూడు కేంద్రాల్లో.. బాలుర ఉన్నత పాఠశాలలో 310, సెయింట్ ఆన్స్ 243, బాలికల ఉన్నత పాఠశాలలో 227 మంది పరీక్షలు రాస్తారని చెప్పారు. తెలుగు పేపరుతో ప్రారంభమైన ఈ నెల 27న సోషియల్ పరీక్షతో ముగియనుందన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్ష ఉంటుందని, నిర్ణీత సమయం కంటే ముందే పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్లతో హాజరు కావాలని కోరారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా ఏవీ.సుబ్రహ్మణ్యరావు, నారాయణరెడ్డి, జి.పరమేశ్వరుడు, చీఫ్ సూపరింటెండెంట్‌గా జి.నరసింహులు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.సుధాకర్‌ను, మొత్తం 40 మంది ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించారని వివరించారు. 2 సెట్ల ప్రశ్నాపత్రాలు 15 రోజుల క్రితమే స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరాయని పేర్కొన్నారు.

రుద్రవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి.అందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ కోటయ్య తెలిపారు. మండలంలో 520 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వారికి రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదే పాఠశాలతో పాటు కేజీబీవీ, పెద్దకంబలూరు, ఏపీ మోడల్ స్కూలు విద్యార్థులు పరీక్షలు రాస్తారు. నర్సాపురం ఎస్టీ థోమస్ మార్తోమా పాఠశాల కేంద్రంలో అక్కడి ఉన్నత పాఠశాల, ఆలమూరు,అహోబిలం,మందలూరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఎంఈఓ వివరించారు.



చాగలమర్రి పోలీసుస్టేషన్‌లో భద్రపరచిన ప్రశ్నాపత్రాలు

ఎన్నికల సమరానికి సిద్ధం కండి

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన, ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. 55 రోజుల్లో జరగనున్న ఎన్నికల సమరానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మహదేవపురం, గుండంపాడు, బోయలకుంట్ల, మోత్కులపల్లె, చెన్నూరు, ఇసుకపల్లె, గోవిందపల్లె, వెంకటాపురంలో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందారెడ్డి, ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగుల బిజేంద్రారెడ్డిని పార్టీ అధిష్టానం ప్రకటించిందని చెప్పారు. గత ఎన్నికల కంటే అధిక మెజార్టీ కోసం కృషి చేయాలని కోరారు. పోలింగ్ వరకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంగా ఉండి అభ్యర్థుల విజయం కోసం పాటు పడాలన్నారు. ఈ ఐదేళ్లలో మన ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే చంద్రబాబు హామీలు బూటకమని, గతంలో వారు వ్యవహరించిన తీరును ప్రజలకు తెలియజేయాలన్నారు. రైతు, డ్వాక్రా రుణమాఫీలపై బాబు చేసిన దగాను ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఒకప్పటి ఫ్యాక్షన్ గడ్డ అయిన ఆళ్లగడ్డ నేడు అభివృద్ధి గడ్డగా మారిందన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలాం, పార్టీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నరహరి. పార్టీ మండల కోశాధికారి వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, సర్పంచులు పెద్ది రమణయ్య, జింకల నాగన్న, నక్కా మరియమ్మ, కందుల మల్లేశ్వరి, చిట్టి బాబు, ఉప సర్పంచులు ఇందూరి శేషారెడ్డి, ఇంతియాజ్, శనగ రమణారెడ్డి, సొసైటీ చైర్మన్లు జింకల శివలింగం, నర్ల రాజశేఖరరెడ్డి, సర్వ నరసింహస్వామి ఆలయ చైర్మన్ రేవనూను రామాంజనేయరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి, నాయకులు లింగారి పుల్లారెడ్డి, ఎరికలరెడ్డి, తిరుపతిరెడ్డి, దండె ప్రతాపరెడ్డి, శివశంకరెడ్డి గాలి ప్రకాశం, జనార్ధన్‌రెడ్డి, రవికుమార్, రమణారెడ్డి, మేర్వ నాగభూణంరెడ్డి, తిరుపతిరెడ్డి, ఎరికలరెడ్డి పాల్గొన్నారు.



గోవిందపల్లెలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకరరెడ్డి

సింహ వాహనంపై విహరించిన శ్రీరంగనాథుడు



కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో వెలసిన శ్రీగోదా దేవి సమేత రంగనాథస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం స్వామివారికి సింహ వాహన సేవ నిర్వహించారు. భక్తుల సకల సౌభాగ్యం కోసం 1008 మంది దంపతులకు పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామిలు తాంబూలం ప్రదానం చేశారు.